క్లుప్తంగా

డీఐఈఓకు సన్మానం



ఆత్మకూర్: వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన అంజయ్యను ఒకేషనల్ అధ్యాపకులు గురువారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. గోపాల్‌పేట ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న అంజయ్య పదోన్నతి పొంది వనపర్తి జిల్లా డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, భాగ్యవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పాన్‌గల్: బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా బాలల పరిరక్షణ విభాగం పీఓ సురేందర్, బాలల సంక్షేమ సమితి సభ్యుడు విష్ణు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో బాలల హక్కులు, రక్షణ చట్టాలు, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ అంజాద్, రమేష్, హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని సవాయిగుడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రెన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలన్నారు. మెరుగైన వైద్యం కోసం సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, దేవర్ల నరసింహ, మహేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్, కృష్ణయ్య, రామకృష్ణ, అంజినాయుడు, బాలరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి



అమరచింత: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య గురువారం తుదిశ్వాస విడిచారు. దీంతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి మాట్లాడుతూ 11 ఏళ్ల పశ్చిమబెంగాల్‌కు సీఎంగా ఉంటూ రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసిన మహానుభావుడని కొనియాడారు. రాష్ట్రంలోని ప్రజలకు సుస్థిర పాలన అందించే విధంగా నిర్విరామంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రాఘవేంద్ర, వెంకటేష్, రఘు, చంటి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి



మదనాపురం: మండల కేంద్రంలో గురువారం మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ మొక్కలు నాటి, వాతావరణ సమతుల్యం పాటించాలని కోరారు. పారిశుద్ధ్యం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌సెంటర్ భవనం పరిశీలన

మదనాపురం: మండలంలోని కొన్నూర్‌లో నూతనంగా నిర్మించిన హెల్త్ సెంటర్ భవనాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి జైచంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్‌సెంటర్ భవనం నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముజుఫర్, శరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మూలమళ్లలో..



పెద్దమందడి కేజీబీవీ పాఠశాలలో..



అమరచింతలో..

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఆత్మకూర్: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీలో, మండలంలోని గ్రామాల్లో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ సుజాత, చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు వేర్వేరుగా పారిశుద్ధ్య కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయ భాస్కర్‌రెడ్డి, వైద్యులు నిస్సార్‌అహ్మద్, నందకిషోర్, వసంత, చైతన్య తదితరులు ఉన్నారు.

అమరచింత: పర్యావరణ సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించారు అదే విధంగా విద్యార్థులకు పర్యావరణంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, కమిషనర్ నురుల్ నదీం, వెటర్నరీ డాక్టర్ వెంకటేష్, డీఎంఆర్ఎం ఆస్పత్రి వైద్యురాలు రూపశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

కొత్తకోట రూరల్: సీజన్ వ్యాధులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వీణ అన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి డాక్టర్ వీణ వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్, సూపర్‌వైజర్ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ రమణరావు అన్నారు. ఆయన మండలంలోని వెలగొండలో మహిళా సంఘ సభ్యులు, ఆశావర్కర్లు, గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం బెక్కెంలో మొక్కలు నాటారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు దొండాయిపల్లి, దావాజిపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ గోవింద్‌రావు పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, హరిత, శ్రీకాంత్ తదతరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య, బాలికల ఉన్నత పాఠశాలలో పరిశుభ్రత, వ్యాధుల నివారణ తదితర విషయాలపై మహిళలు, బాలికలకు మండల ప్రత్యేక అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ వైద్యాధికారి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ రాజు, ఏపీఎం రాంబాబు, వైద్య సిబ్బంది నర్సింహులు, ఏఎన్ఎం శంకరమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం చింతకుంటలో..



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో..



బెక్కెం గ్రామంలో..

కస్తూర్బా విద్యార్థులకు వైద్య పరీక్షలు



మదనాపురంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



పాన్‌గల్‌లో..

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం, ఆరోగ్యం, సీజనల్ వ్యాధులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టడం ద్వారా డెంగీ వ్యాపించే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ హరీష్, ఫార్మసిస్టు స్వప్న, కేజీబీవీ ఎస్ఓ హేమలత, చెన్నమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, మదన్‌గోపాల్, మధుబాబు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక డాక్టర్ భవానీ సీజనల్‌గా వచ్చే వ్యాధులు, మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఇళ్లలోకి దోమలు చేరకుండా కిటికీలకు దోమతెరలు కట్టాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో ఉన్న టైర్లు, పాత కూలర్లు, టెంకాయ చిప్పల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున్ ప్రిన్సిపాల్ వినోద, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై దాడి: కేసు నమోదు

పెబ్బేరు రూరల్: మహిళపై దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదైందని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లికి చెందిన వడ్డె కురుమూర్తి భార్య మృతి చెందింది. తల్లి చనిపోవడంతో ఇద్దరు పిల్లలు కురుమూర్తి తమ్ముడి వద్ద ఉన్నారు. ఈనెల 7న అతడు మద్యం తాగి మత్తులో తమ్ముడి ఇంటికి వెళ్లి తమ్ముడి భార్యతో గొడవపడి చేయి చేసుకున్నాడు. గురువారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కురుమూర్తిని రిమాండ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

నీటి నిల్వలు ఉండొద్దు



పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ పద్మావతి సూచించారు. గురువారం ఆమె వనపర్తి మండలంలోని చిట్యాలలో ఎంపీడీఓ రాఘవతో కలిసి పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్తులతో మాట్లాడుతూ డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సుదర్శన్, కార్యదర్శి సుస్మిత, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కులసంఘం భవన నిర్మాణ పనుల అడ్డగింత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 6వ వార్డులోని కొత్తూర్ రోడ్డు సమీపంలో గల దాదాపు 3ఎకరాల ప్రభుత్వ స్థలంలో గత ప్రభుత్వం వివిధ కుల సంఘాల కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించింది. మేస్త్రీ సంఘం, ఆటో రిక్షాల సంఘం, బుడజంగాలు, బైక్ మెకానిక్, ఎరుకల, ఫొటోగ్రాఫర్లు, కటిక, రెడ్డి సంఘం, ట్రాక్టర్స్ యూనియన్, ఆటో యూనియన్, పెయింటింగ్ సంఘం, వాకింగ్ క్లబ్, రిక్షా సంఘం వారికి భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు స్థలం ఇవ్వడంతో పాటు కొన్ని సంఘాల వారికి భవన నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. గురువారం బుడగజంగాల సంఘం ఆధ్వర్యంలో వారికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా.. పట్టణ కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆ పొలం తనదని డ్రిల్లింగ్ మిషన్ తీసుకొచ్చి భవన నిర్మాణ పనులు అడ్డుకొని పిల్లర్లను కూల్చి వేశాడు. దీంతో బుడగజంగాల సంఘం సభ్యులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో, కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత పాలకులు స్వార్థ రాజకీయాల కోసం రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం ఇలా ఇవ్వడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇలాంటి విలువైన స్థలంలో ప్రభుత్వ కార్యాలయాల కోసం భవనాలు నిర్మిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పిల్లర్ దిమ్మలను తొలగించిన దృశ్యం

పాన్‌గల్ నూతన ఎస్ఐగా శ్రీనివాసులు

పాన్‌గల్: పాన్‌గల్ మండల నూతన ఎస్ఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కళ్యాణ్‌రావు ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడంతో ఆయన స్థానంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో డీసీఆర్‌బీలో ఉన్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పెబ్బేరు రూరల్: పెబ్బేరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పలు గ్రూపుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాలలో వివిధ గ్రూపుల్లో ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్స్ అలాగే ఎలక్ట్రికల్ మరియు కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ బ్రాంచుల్లో మిగిలిపోయిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఈ నెల 11 వరకు స్వీకరిస్తామన్నారు. 12న స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు.

పాఠశాల అభివృద్ధికి నిధుల మంజూరుపై హర్షం

చిన్నంబావి: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దదగడ, పెద్దమారు పాఠశాలలను ఇంటర్నేషనల్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తను చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలను అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేయాలని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే పాఠశాల అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయడంతో పాటు తన సొంతంగా ఎంత ఖర్చు అయినా భరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పెద్దమారులోని పాఠశాలలో గురువారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధర్మతేజ మాట్లాడుతు కొల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు గ్రామాల్లోని ఎనిమిది పాఠశాలలను మంత్రి జూపల్లి దత్తత తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ విద్యాసాగర్ రావు, హుస్సేనయ్య, ప్రధానోపాధ్యాయులు రమణమ్మ, అలివేలు, భరత్‌కుమార్, హనుమంతురావు, భీముడు, వెంకటేశ్వర్‌రావు, నారాయణరావు, శివ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

హామీల అమలులో విఫలం

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు అమలులో విఫలమైందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి హనుమంతు మండిపడ్డారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం వనపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, పేదలకు ఇళ్ల తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, ప్రసాద్, గణేష్, కురుమయ్య, అంజి, చింతలయ్య, మురళి, పరిమళ, శ్రావణి, జ్యోతి, బేబీ పాల్గొన్నారు.

చిట్యాలను సందర్శించిన అదనపు కలెక్టర్

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాలను గురువారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ గురువారం సందర్శించారు. గ్రామంలో మొక్కలు నాటి, మహిళా సంఘం సభ్యులు శాలివాహన కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన శ్రీసాయి స్టీల్ బ్యాంక్‌ని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్‌డీఓ ఉమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధించాలంటే ప్రజలు శుభ కార్యక్రమాలకు ఈ స్టీల్ బ్యాంక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రపంచాన్ని నేర్పించేది పుస్తకం

వనపర్తిటౌన్: ప్రపంచాన్ని, జీవితాన్ని నేర్పించే నేస్తం పుస్తకమని, విద్యార్థులు అందరూ పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. గురువారం పుస్తక సేకరణ కార్యక్రమాన్ని సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కేడీఆర్‌కు చెందిన సత్యనారాయణగౌడ్ తనతో ఉన్న దాదాపు 200 పుస్తకాలను సాహితీ కళావేదిక సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. మానవ జీవితానికి పుస్తకాలు దిశానిర్దేశం చేస్తాయని, విలువలతో కూడిన పుస్తకాలు ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న పుస్తకాలను తమకు అందిస్తే వాటిని ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక ప్రతినిధులు చంద్రశేఖర్, డి. రాములు, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు సేకరిస్తున్న సాహితీ వేత్తలు

'సంస్కృతిని భావితరాలకు అందించాలి'

ఖిల్లాఘనపురం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశ, దైవ భక్తిని భావితరాలకు బాలసంస్కార కేంద్రాల ద్వారా చేరవేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా పెద్దలు రాచాల జనార్దన్, గాండ్ల రాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాలుగు బాల సంస్కరాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల నిర్వహణకు పల్నాటి నారాయణ ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే వారిలో దేశ భక్తిని పెంపొందించాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగిన విద్యార్థులను తయారు చేసి రాబోయే తరానికి అన్ని రంగాల్లో ఆదర్శంగా పని చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు అంజనేయులు, బజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు పాలవాది రాజు, శాంతయ్య, భాస్కర్, అశోక్, గోపి, రామకృష్ణ, బాలరాజు, పవన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిషత్ నాయకులు

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డులో సమస్యలు తీవ్రంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ డీవైఎఫ్ఐ, సీపీఎం నాయకులు అసహనం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కాలనీలో పురాతన ఇనుప కరెంట్ స్తంభాలు కూలిపోయేందుకు ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బహిర్భూమికి వెళ్తున్నారని వెంటనే మహిళలకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. కాలనీలో మట్టి మిద్దెలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని ప్రస్తుత వర్షాలకు కూలిపోయే అవకాశం ఉందన్నారు. అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని అధికారులు అధికారికంగా ప్రారంభించి చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, వినోద్, నేపాల్, జాన్, రవి, చిన్న, రాజరత్నం, అరుణ్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వనతిపత్రం అందిస్తున్న నాయకులు

బహుమతుల అందజేత

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాలలో 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీల్లో విజయం సాధించిన వారికి గురువారం పాఠశాల హెచ్ఎం షేక్యానాయక్ బహుమతులు అందించారు. వ్యాస రచనలో గణేష్(9వ తరగతి), నందిని(8వ తరగతి), ఉపన్యాస పోటీల్లో ముదసిర్ (7వ తరగతి), గణేష్ (9వ తరగతి), డ్రాయింగ్ సీనియర్ విభాగంలో లోకేశ్వరీ (10వ తరగతి), పురుషోత్తం (10వ తరగతి), జూనియర్ విభాగంలో జగదీష్ (8వ తరగతి), తరుణ్ (7వ తరగతి), ప్రోత్సాహక బహుమతి రామాంజనేయులు (6వ తరగతి) అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు గ్రామస్తులకు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించి, విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కుర్మయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి మండలంలోని రాజనగరం, రాజపేట, ఈదుల చెరువు గ్రామాల్లో అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో గురువారం పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. 15 రోజుల వరకు రైతులకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుదని, అధికారులు నీటి విడుదలలో అలసత్వం ప్రదర్శించొద్దని సూచించారు. కాల్వల వెంట మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి చెరువుకు నీరందించేదుకు తాను వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని ఆయన రైతులకు ధైర్యం చెప్పారు. అనంతరం రాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలోని పలు సమస్యలను హెచ్ఎం ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకెళ్లారు.



రాజపేటలో పాఠశాలలో అన్నం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

'మూగజీవాలను హింసిస్తే సహించం'



మూగజీవాల సంరక్షణపై రైతును హెచ్చరిస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి



ప్రతినిత్యం ఈ బురదలోనే ఉంటున్న గేదెలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కానమోని కిష్టయ్య అనే రైతు ఆవులు, గేదెలు పెంచుతూ వాటి పోషణకు అవసరమైన కనీస వసతులు కల్పించకపోవడంతో ప్రతి నిత్యం అవి బురదలోనే ఉండాల్సి వస్తుందని, వెంటనే వాటికి అవసరమైన వసతులు కల్పించకుంటే తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరలక్ష్మి ఎపాడిరైతును హెచ్చరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గురువారం పశువుల స్థావరాన్ని ఆమె సందర్శించారు. ఆవులు, గేదెలు కలిపి 50 వరకు ఉన్నా.. వాటికి అవసరమైన మేతను అందివ్వడంలో నిర్లక్ష్యం వహించడమే కాక కనీసం అవి నిద్రించేందుకు అవసరమైన పాకను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులు బక్కచిక్కి అనారోగ్య స్థితిలో ఉన్నాయని, అపరిశుభ్ర పరిసరాల వల్ల అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు నెలకొంటాయని ఆమె అన్నారు. పశు పోషణలో నిర్లక్ష్యం వహిస్తే వాటిని గోశాలలకు పంపించడం లేదా ఇతరులు పోషిస్తామని ముందుకు వస్తే వారికి అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, హెచ్‌సీ వెంకటేష్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

పెబ్బేరు రూరల్: దేశంలో పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాటం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసింహ మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించడం సరికాదన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భరత్, మోష, శ్రీహరి, గోపాలకృష్ణ, శ్యాంసుందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన బస్సును ఢీకొట్టిన ఆటో

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం వద్ద ఆగిన పాఠశాల బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొట్టిడంతో ఇద్దరికి గాయాలయిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం పెబ్బేరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు గురువారం సాయంత్రం రంగాపురంలో పిల్లలను దించుతుండగా.. వెనుక నుంచి అతి వేగంగా ట్రాలీ ఆటో బస్సును ఢీకొట్టడంతో బస్సు అద్దాలు పగిలిపోవడంతో చిన్నారులకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.